క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



మూల పెద్దమ్మకు హారతి పడుతున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. జూన్ 8,9,10 తేదీల్లో దేవర సందర్భంగా పెద్దమ్మకు ముడుపు కట్టారు. దీంతో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు మాత్రమే చేశారు.

కళారాధన అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదనరావు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల కళారాధన అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శిగా డాక్టర్ రవికృష్ణ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మధుమణి నర్సింగ్ హోం సమావేశ భవనంలో నిర్వహించిన కళారాధన వార్షిక సర్వసభ్య సమావేశంలో రానున్న రెండు సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నంద్యాలలో కళలను, కళాకారులను ప్రోత్సహించాలని 300 మందితో కళారాధనను స్థాపించామన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి గురువులను పిలిపించి సన్మానించారు. 20 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామమోహన్‌నాయుడు, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, రజాక్ బాషా, శివ, ఫణీష్‌కుమార్, రామనాయుడు, అరుణ్, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పట్టణంలోని శ్రీశారదా విద్యాపీఠం విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం, వాసవీ, జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బింగుమల్ల శ్యాం సుందర్‌గుప్త మాట్లాడుతూ క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, మంచి నడవడిక నేర్పుతున్న శారదా విద్యాపీఠం స్కూల్ అభినందనీయమన్నారు. డాక్టర్ గెలివి సహదేవుడు, ప్రధానోపాధ్యాయుడు వెంకటకృష్ణయ్య, నాగరాజు, అనిల్, బొగ్గరపు జనార్దన్, శ్రీనివాస దత్తాత్రేయ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

పోతినేని ప్రసాద్ మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

చాగలమర్రి: ఉమ్మడి కర్నూల్ జిల్లా ఎస్టీయూ మాజీ అధ్యక్షుడు పోతినేని ప్రసాద్ మృతి సంఘానికి తీరని లోటు అని రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ అన్నారు. చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పోతినేని ప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హాజరై ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శులు శివశంకర్, రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అజంబేగ్, జిల్లా ఉపాధ్యక్షులు అమీర్‌బాషా, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, మండల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





ఉయ్యాలవాడ- ఆర్.పాంపల్లె గ్రామాల మధ్య నీట మునిగిన పంట పొలాలు, ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో చేపల చెరువు కట్ట తెగి ప్రవహిస్తున్న వర్షపునీరు, దొర్నిపాడు శివారులో పదునైన పొలాలు

వదలని వర్షం

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జోరుగా వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని రోజులుగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వానలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఇప్పటికే కురిసిన వానకు భూమి పదును కావడంతో కొందరు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. – ఉయ్యాలవాడ/దొర్నిపాడు

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కుమారస్వామికి షష్టి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దస్తగిరి స్వామి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని చెరువు కట్టపై దస్తగిరి స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి బాసికాలు, జెండాలు, బంగారు, వెండి కానుకలు సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి శెట్టివీడు, చాగలమర్రి గ్రామాలకు చెందిన దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవవారం జియారత్ కార్యక్రమంతో స్వామి ఉత్సవాలు ముగుస్తాయి. కమిటీ సభ్యులు ముల్లా మహమ్మద్ హనీఫ్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉరుసుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చాగలమర్రి ఎస్‌ఐ సురేష్ ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు ముల్లా మౌలాలి, ముల్లా మహమ్మద్ హనీఫ్, ముల్లా ఖలీల్, ముల్లా అజీం, మాబుసేన్, షేక్ చిన్న భికారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకుడు సంజయ్ దావలికర్

నంద్యాల(వ్యవసాయం): భవిష్యత్తు తరాల కోసం మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర విశేష సంపర్క్ ప్రముఖ్ సంజయ్ దావలికర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టెక్కె భరత మాత దేవాలయం వద్దనున్న వీహెచ్‌పీ కార్యాలయంలో కుల సంఘాలు, మేధావులు తదితరులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని రంగాల్లో సంపర్క్ దిశగా విశ్వహిందూ పరిషత్ పని చేస్తుందని, స్థాపించిన నాటి నుంచి నేటి వరకు 60 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అయోధ్య రామమందిర జన్మ భూమి ఉద్యమ సమయంలో పురుడు పోసుకున్న విశేష సంపర్క్ విభాగం ద్వారా హిందూ సమాజంపై జరుగుతున్న అనేక రకాల భౌతిక, శారీరక, మానసిక దాడులను సమాజంలోని మేధావుల ముందుంచి వాటి పరిష్కారానికి వారితోనే ఆలోచన చేయిస్తున్నట్లు చెప్పారు. రాబోయే తరాన్ని ఆనందంగా, సుఖంగా, సంతోషంగా జీవించే మార్గాలను అన్వేషించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, సందీప్, శేషసాయి, ఆదినారాయణలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



భక్తులకు గంగ కాటమరాజు కథను వినిపిస్తున్న కళాకారులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో గంగ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. రైతు సంఘం నాయకులు, యాదవులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో శనివారం అర్ధరాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామునే భక్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, బోనాల నైవేద్యంతో మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వాటిని అమ్మవారికి సమర్పించి ఈ ఏడాది పంటలు బాగా పండాలని, గ్రామం ప్రశాంతంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా గంగమ్మ తల్లి విశిష్టత, గంగా కాటమరాజు కథను కళాకారులు భక్తులకు వివరించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఆర్.పాంపల్లెలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న ఎద్దులు



వృషభాల యజమానులకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక చెరువ కట్టపై వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్, నంద్యాల జిల్లాల నుంచి సుమారు 12 జతల ఎద్లు పాల్గొన్న ఈపోటీల్లో కర్నూలు జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, నంద్యాల జిల్లా వెంకటగిరి గ్రామానికి శశాంక్ ఎద్దులు కంబైన్డ్‌గా ప్రథమ స్థానంలో నిలిచి రూ.40,000 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. రెండో స్థానంలో ప్రొద్దుటూరులోని అయోధ్యనగర్, మూడవ స్థానంలో కర్నూలు జిల్లా తాండ్రపాడు, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా కానాల గ్రామం, ఐదవ స్థానంలో కర్నూలు జిల్లా వెంకటగిరి గ్రామం, ఆరవ స్థానంలో నంద్యాల జిల్లా దాసరిపల్లె గ్రామం, ఏడో స్థానంలో వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లె గ్రామం, ఎనిమిదో స్థానంలో నంద్యాల జిల్లా కోటకందుకూరు , తొమ్మిదో స్థానం నంద్యాల జిల్లా అప్పనపల్లె గ్రామం, బండి ఆత్మకూరు గ్రామాల వృషభాలు నిలిచాయి. పదవ స్థానంలో సత్యసాయి జిల్లా ముక్తాపురం, పదకొండో స్థానం నంద్యాల జిల్లా ఇసుకపల్లె గ్రామాలకు చెందిన వృషభరాజములు నిలిచాయి. 2వ స్థానం నుంచి 11వ స్థానం వరకు నిలిని ఎడ్ల యజమానులకు దాతలు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కొలిమి షరీఫ్, మహమ్మద్ హనీఫ్, చిన్న రాముడు యాదవ్, కొలిమి ఉసేన్‌వలి, షేక్.ఇమాంహుస్సేన్ (రిటైర్డ్ హెచ్‌ఎం), ఖలీల్, రఫీ, మాబుషరీఫ్, షేక్ దాదాపీర్, మహబూబ్‌బాషా, రహమతుల్లా, చెంబుల మహబూబ్‌బాషా, మాజి సర్పంచ్ ఎంఎస్ అన్సర్‌బాష, దర్గా కమిటీ సభ్యులు ముల్లా మౌలాలి హనీఫ్,ఖలీల్, దాతలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో జాతీయ సమితి సభ్యుడిగా తనను ఎన్నుకున్నట్లు నంద్యాల జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు. ఇదిలా ఉంటే నాగరాముడు ఎన్నికల పట్ల నంద్యాల ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ తదితర ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గాజులపల్లెలో యువకుడిపై దాడి

మహానంది: రోడ్డుపై ఆగి ఉన్న ఓ యువకుడిని కారులో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి గాజులపల్లెలో చోటు చేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గాజులపల్లెకు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకుడు షేక్ అబ్దుల్ ఖాదర్ రాత్రి గాజులపల్లె మెట్ట వద్ద ఉన్న ఓ జనరల్ స్టోర్ దగ్గర ఉండగా.. అంతలోనే ఎర్టిగా కారులో నలుగురు వ్యక్తులు వచ్చారు. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి ఒక్కసారిగా అబ్దుల్ ఖాదర్ ముఖంపై పిడిగుద్దులు కురిపించి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా వివాహేతర సంబంధం, ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించడమే దాడికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. కర్నూలుకు చెందిన వారు దాడికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసినట్లు సమాచారం.

ఆళ్లగడ్డలో చికెన్ ధర ఎందుకంత ఎక్కువ?

- కోవెలకుంట్లలో కిలో రూ. 170 ఉంటే ఇక్కడ రూ. 240 విక్రయిస్తున్నారు
- అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి



చికెన్ దుకాణాల దగ్గర ధరలను పరిశీలించి మాట్లాడుతున్న భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: పక్కనే ఉన్న కోవెలకుంట్ల, నంద్యాలలో కిలో చికెన్ రూ. 170 నుంచి రూ. 180 లెక్కన విక్రయిస్తుంటే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాత్రం కిలో చికెన్ రూ. 240 నుంచి రూ. 260 వరకు ధర నిర్ణయించి విక్రయించడమేమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని చికెన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల కంటే ఆళ్లగడ్డలో కిలో పై రూ. 70 నుంచి రూ. 80 ఎమ్మెల్యే అఖిలప్రియ పేరు చెప్పి అదనంగా వసూలు చేస్తున్నారన్న విషయం బహిరంగంగా చర్చించుకుంటున్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. దుకాణాదారులను ఎందుకు అంత రేటు వసూలు చేస్తున్నారంటే హోల్‌సేల్‌లో అధికధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. అయితే, పెంచిన భారమంతా సామన్య ప్రజలపై మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చికెన్‌పై వసూ లు చేస్తున్న అధిక సొమ్ము ఎవరి జేబుల్లోకి పోతుందో అందరికి తెలుసన్నారు. ప్రజలు ఓట్లు వేసి నిన్ను ఎమ్మెల్యేను చేసింది ప్రజలు దోచుకునేందుకేనా అని అఖిలప్రియను ప్రశ్నించారు. ప్రభు త్వం నిర్ణయించిన ధరకంటే ఇంత అదనంగా వసూలు చేస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేక పోతున్నారో సమాధానం చెప్పాలన్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు చికెన్ విక్రయించేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే దీనిపై ప్రత్యేక నిరసన తెలియజేయాల్సి ఉంటుందని హెచ్చరించారు

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు




ఆర్అండ్‌బీ రోడ్డుకు ఓ వైపు గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం నుంచి నర్సాపురం వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం కొండమాయపల్లె వైపు నుంచి రుద్రవరం గ్రామ శివారు వరకు రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ వేగవంతంగా చేయించారు. అక్కడ పూర్తి కాగానే రుద్రవరం నుంచి నర్సాపురం వైపు పనులను ప్రారంభించారు. యంత్రాలతో రోడ్డుకు ఇరువైపుల గుంతలు తీశారు. ఆ గుంతల్లో కంకర తోలి చదును చేయాల్సి ఉండగా అవేవి చేయకుండా పనులను నిలిపేశారు. దీంతో ఆటో డ్రైవర్లు స్టాండ్ వద్ద వాహనాలు నిలుపుకునేందుకు స్థలం లేక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉంచుకుంటున్నారు.అలాగే గుంతలు లోతుగా తవ్వడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేక చుట్టు తిరిగి రావాల్సి వస్తోంది. పంచర్ బంకుల వారు, వాటర్ ప్లాంట్ దారులు, మెకానిక్‌లు, టిఫిన్ సెంటర్లు, సర్వీసింగ్ సెంటర్ల నిర్వాహకులు తదితర చిరు వ్యాపారులు గుంతలు దాటుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు తవ్విన ప్రదేశంలో వాహనాలు ఒకదానికొకటి ఎదురు పడినప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

‘చేతి’తో.. తల‘రాత’ మార్చుకో

- సమాధాన పత్రంపై చేతిరాతకు ప్రాధాన్యం
- పేపర్ దిద్దే అధ్యాపకుడికి అర్థమయ్యేలా అక్షరాలు ఉండాలి
- ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు



నంద్యాల(న్యూటౌన్): ఏడాది కష్టం విద్యార్థి సాధించిన మార్కుల రూపంలో కనిపిస్తుంది. మెరుగైన మార్కుల సాధనకు మస్తిష్కంలో పొందికైన విజ్ఞానమే కాకుండా చేతి రాత కూడా అవసరం. మెదడులో నుంచి పుట్టే ఆలోచనలు సమాధాన పత్రంపై పెట్టేటప్పుడు మన అక్షరాలు పేపర్ దిద్దే వారికి అర్థమవ్వాలి. ఒక వేళ చేతి రాత బాగాలేకపోతే పరీక్ష తప్పేందుకు, మార్కులు తగ్గేందుకు కూడా అవకాశం ఉంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందులో మెరుగైన మార్కులు సాధించేందుకు చేతి రాతపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు నిపుణులు. అక్షరాలు ముత్యాల్లాగా రాసేవారికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చెబుతున్నారు.

చేతి రాత ప్రాధాన్యమిదీ..

చేతి రాతను బట్టి మనిషి వ్యక్తిత్వం, గుణగణాలు చెప్పొచ్చు అంటారు. చేతిరాత మెదడులో సంక్లిష్ట అనుసంధానాల్ని ప్రేరేపిస్తుందనీ, జ్ఞాపక శక్తిని పెంచుతుందని చాలా అధ్యయనాలు తేల్చాయి. భావ వ్యక్తీకరణ, భాషా నైపుణ్యాలూ పెరుగుతాయి. ఆలోచనలను చేతిరాతలో పెట్టడం వల్ల సృజనాత్మ కత పెరుగుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఉన్న చేతి రాత చదివేవారికి అర్థమయ్యేలా ఉండాలి. మరీ ముఖ్యంగా పరీక్షా పేపర్లు దిద్దే అధ్యాపకునికి సమాధాన పత్రంలోని చేతిరాత అర్థమయ్యేలా ఉండాలి. అలాగని ప్రతి అక్షరాన్ని శిల్పాల్లా తీర్చిదిద్దాల్సిన అవసరం లేదు.

రాతతోనే మంచి మార్కులు



ప్రతి విద్యార్థికి చదువుతో పాటు చేతిరాత ముఖ్యం . రాత మంచిగా ఉంటే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయి. ప్రధానంగా ఇప్పుడు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు దీనిని దృష్టిలో ఉంచుకోవాలి. ఏ విద్యార్థి అయిన సరే చేతిరాత బాగాలేదని బాధపడకుండా సాధన చేస్తే వస్తుంది. మేము పాఠశాలలో విద్యార్థులకు రైటింగ్ స్కిల్‌పై అవగాహన కల్పిస్తూ ప్రాక్టీస్ చేయిస్తున్నాం.

– కేవీ సుబ్బారెడ్డి,ఇంగ్లీష్ టీచర్, జిల్లా పరిషత్ హైస్కూల్, చాపిరేవుల


ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- పెన్ టిప్‌కు దూరంగా పట్టుకుని రాయడం ద్వారా అక్షరాలు రాసే విద్యార్థికి పూర్తిగా కనిపిస్తాయి.
- ఏ రకమైన పెన్ను వేగంగా రాయడానికి సాయంగా ఉంటుందో ముందుగానే కొంత ప్రాక్టీస్‌తో గుర్తించి పెన్నును ఎంపిక చేసుకోవాలి.
- చేతిలో పెన్నును తేలికగా పట్టుకునేలా అలవాటు చేసుకోవాలి.
- పేజీలో 16 నుంచి 20 లైన్లకు మించి రాయకూడదు.
- ఇంగ్లిష్ అక్షరాలు మూడు మిల్లీ మీటర్లు, తెలుగు, హిందీ అక్షరాలు నాలుగు మిల్లీ మీటర్లు పొడవు ఉండేలా రాయడం ద్వారా రాత బాగుంటుంది.
- అక్షరానికి అక్షరానికి, పదానికి పదానికి మధ్య తగిన ఖాళీ ఉండేలా జాగ్రత్తపడాలి.
- పెన్ను పట్టుకునే విధానం, కూర్చునే భంగిమ, సమాధాన పత్రాన్ని అమర్చుకునే తీరు రాతను ప్రభావితం చేస్తాయి.
- రాసేటప్పుడు శీర్షికలు, ఉప శీర్షికలను అండర్ లైన్ చేస్తే బాగుంటుంది.
- సమయాన్ని దృష్టిలో పెట్టుకుని చేతిరాతకు ప్రాధాన్యతనివ్వాలి.
- చదివిన దాన్ని ఇంటి దగ్గర ఒకసారి రాసి చూసుకోవడంద్వారా పరీక్ష రాసినప్పుడు ఒత్తిడికి లోనుకాకుండా ఉండగలుగుతాం.
- ఒక్కొక్క లైనులో ఆరు నుంచి ఏడు పదాలు ఉండేలా చూసుకోవాలి. ఎక్కడైనా తప్పుగా రాస్తే ఆపదంపై పదే పదే రుద్దాల్సిన అవసరం లేదు. కేవలం కొట్టేయాలనుకున్న పదంపై ఒకటి లేదా రెండు గీతలను అడ్డంగా రాస్తే సరిపోతుంది. ఎక్కువ తప్పులు రాయకుండా జాగ్రత్త పడాలి.
- తెలిసినదంతా రాసేద్దామన్న ఆలోచన విద్యార్థి చేయకూడదు. ఎన్ని మార్కులు కేటాయించారు. ఆమేరకు మాత్రమే సమాధానాన్ని రాస్తే సరిపోతుంది. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు, స్వల్ప సమాధాన ప్రశ్నలకు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలకు కేటాయించిన మార్కులు ఆధారంగానే సమాధానాన్ని రాయాలి. అందుకు తగిన సమయాన్ని ప్రణాళికాబద్ధంగా కేటాయించుకోవాలి.

పైపాలెం రైతులకు అండగా ఉంటాం

నందికొట్కూరు: సోలార్ గ్రీన్ కో బాధితులైన పైపాలెం రైతులకు అండగా ఉంటామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ చెప్పారు. ఆదివారం మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామ రైతులపై గ్రీన్ కో ఆగడాల గురించి వారు చర్చించారు. గ్రీన్ కో సోలార్ నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ ప్రజలు, రైతులు వారికి తెలియజేశారు. వారు మాట్లాడుతూ గ్రీన్ కో సోలార్ కంపెనీ గ్రామసభ నిర్వహించకుండా, ప్రజల ఆమోదం లేకుండా పనులు ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంట పొలాలకు వెళ్లే రస్తాలను గ్రీన్ కో కంపెనీ ఆక్రమించుకోవడం దారుణమని చెప్పారు. భూముల చుట్టు ఉన్న రాళ్లకతులను రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు తొలగిస్తున్నారని నిలదీశారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు జీవనాధారంగా ఉన్న కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడం సబబుకాదన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా గ్రీన్ కో సోలార్ కంపెనీకి ఎలా అప్పగిస్తారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా, మద్దిలేటి, రామకృష్ణ, ఓబులేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని వెలగలపల్లె పొలిమేరలో వెలసిన మహాత్రిపుర సుందరి, మానస లింగేశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద పండితులు ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మధు సూధనరెడ్డి, రంగనాయకులు, కానాల నరసింహులు, నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యులు హరినాథరెడ్డి తదితరుల స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అంతకు ముందు లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.